కలుగలేదు. సింహాసనం మీద కూర్చొని రాముడు పరిపాలన చేస్తున్నాడు ఆ రాముడిని నేను ధ్యానం చేయటంలేదు, రావణాసురుడి లాంటి పెద్ద రాక్షసుడిని చంపాడు, రావణాసురుడిని చంపిన రాముడిని నేను ధ్యానం చేయటం లేదు. అనేక అవమానాలు, మాటలుపడ్డాక కూడా ఆయన మొఖంలో వికారం కలుగలేదు, ఆ మాటలు చెవిలో పడకముందు ఎంత ప్రశాంతంగా ఉన్నాడో, ఆ మాటలు విన్నాక కూడా అంత ప్రశాతంగా ఉన్నాడు, మూర్తీభవించిన శాంతి, మూర్తీభవించిన జ్ఞానం, మూర్తీభవించిన సౌందర్యం, అది శాంతి యొక్క పరాకాష్ట, జ్ఞానం యొక్క పరాకాష్ట అట్టి రాముడిని మాత్రమే నేను ధ్యానం చేస్తున్నాను అన్నాడు తులసీదాసు. ఈ ఒక్క వాక్యం మీరు శ్రద్ధగా వినండి, జ్ఞాపకం ఉంచుకోండి, శ్రద్ధగా మననం చేయండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-12-2006, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రెలిటివ్ నాలెడ్జ్, ఎబ్‌సల్యూట్ నాలెడ్జ్ అని నాలెడ్జ్‌లో రెండు రకాలు ఉన్నాయి. రెలిటివ్ నాలెడ్జ్ అంటే సాపేక్షిక జ్ఞానం. లెక్కలు, తెలుగు, ఇంగ్లీషు, ఇంజనీరింగ్, మెడిసిన్ ఇలా మన ఇంద్రియాలను ఉపయోగించి మనస్సుతో సంపాదించే జ్ఞానం సాపేక్ష జ్ఞానం. సాపేక్షిక జ్ఞానం వలన మన పొట్ట బాగా వెళ్లిపోతుంది. నెలకో లక్ష రూపాయలు జీతం సంపాదించ వచ్చు, మేడలు కట్టుకోవచ్చు, కారుల్లో తిరగవచ్చు, మీరు పాండిత్యం బాగా సంపాదిస్తే సన్మానాలు చేస్తారు. అక్కడితో ఆఖరు, స్మశానంతో దీనికి ముగింపు. లోకం ఎంత నిజమో, దేహం ఎంత నిజమో, మనస్సు ఎంత నిజమో ఈ సాపేక్షిక జ్ఞానం కూడా అంతే నిజం. దీని వలన మనకు ఆత్మజ్ఞానం కలుగదు. ఎబ్‌సల్యూట్ నాలెడ్జ్ అంటే పూర్ణజ్ఞానం, ఆత్మజ్ఞానం, ఆత్మజ్ఞానం ఇంద్రియాల వలన, మనస్సు వలన వచ్చేది కాదు, అది భక్తి వలన, భగవదనుగ్రహం వలన రావాలి. భక్తి లేనివాడికి వైరాగ్యం రాదు. వైరాగ్యం లేనివాడికి ఆత్మజ్ఞానం రాదు. భక్తి వలన, వివేకం వలన, నిష్కామకర్మ వలన, స్వార్థరహితంగా జీవించటం వలన, భగవదనుగ్రహం వలన ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీ ప్రవర్తన చాలా మంచిది అనుకో అప్పుడు అయినా భగవదనుగ్రహం లేకుండా ఆత్మజ్ఞానం రాదు.

జ్ఞానం కావాలి అని పెద్ద సూరమ్మగారు భగవాన్‌ను అడిగారట. భగవాన్ ఏమన్నారు అంటే నీకు జ్ఞానం కావాలి అంటున్నావు. అది సంపాదించేది కాదు. జ్ఞానం అనేది సహజంగా నీ హృదయంలోనే ఉంది. సంపాదించేది అయితే కాలప్రవాహంలో పోతుంది. నీ శరీరంగాని,

నీ ఆస్తులుగాని, నీ పదవులుగాని ఏదీ కాలప్రవాహం ముందు నిలబడవు, అన్నీ కొట్టుకొనిపోతాయి అని వాల్మీకి చెప్పాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీ గుండెలో ఏముందో ఇతరులకు తెలియక పోయినా నీకు తెలుస్తుంది. నీ హృదయంలో ఉన్న చెత్తనంతా బయటకు తోసెయ్యి. ఏ కారణం వలన హృదయంలో ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి రావటం లేదో ఆ కారణాలను బయటకు తోసెయ్యి. అప్పుడు ఉన్నది ఏదో నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది, అదే జ్ఞానం, అంతేగాని అది బజారుకు వెళ్లి డబ్బు ఖర్చు పెట్టి కొనుక్కొనేది కాదు. జ్ఞానం నీలోపలే ఉంది. ఏ కారణం వలన నీకు అనుభంలోనికి రావటం లేదో తడిమి చూసుకో, వాటిని బయటకు గెంటి వెయ్యి. అప్పుడు నీ లోపల ఉన్న సద్వస్తువు నీకు వ్యక్తమవుతుంది. అదే బ్రహ్మం, అదే జ్ఞానం, అదే ఉండటం, అదే ఏకం. ఆ వస్తువు నీకు ఎరుకలోనికి వచ్చినప్పుడు నో మోర్ రీబర్త్, నో మోర్ డెత్, నో మోర్ సారో. మీకు ఏ కారణం వలన అయినా దుఃఖం వస్తోంది అనుకోండి మీకు పునర్జన్మ వచ్చి తీరుతుంది. శరీరం ఉండగానే ఎవడైతే దుఃఖరహిత స్థితిని పొందాడో ఇంక వాడికి పునర్జన్మ లేదు.

గ్రామాలను ఉద్ధరించటానికి పనిచేస్తున్నాము, దేశాన్ని ఉద్ధరించటానికి పని చేస్తున్నాము అని చాలామంది చెపుతున్నారు. మరి దేశంలో ఉన్న బాధలు, దుఃఖం అలాగే ఉంది ఏమిటి అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే ఓరి పిచ్చివాడా! అహంకారంతో చేసే పని ఎందుకు పనికిరాదు అంటున్నారు. అహంకారం లోపల పెట్టుకొని ఏదో గ్రామాన్ని బాగుచేస్తున్నాను, దేశాన్ని బాగుచేస్తున్నాను అంటే అది నీ అహంకారం పెంచుకోవటానికి కాని ఊరికి ఏమీ ఉపయోగపడదు, దేశానికి ఉపయోగ పడదు. నువ్వు సత్వగుణంతో పని చెయ్యి. అహంకారంతో నువ్వు ఎవరికైనా ఉపకారం చేసినా వాడు సుఖపడడు. నీకూ సుఖం లేదు. సత్వగుణంతో నీవు పనిచేస్తూ ఉంటే అది నీకు సుఖమే, ఇతరులకు సుఖాన్ని ఇస్తుంది. చివరకు సత్వగుణం నిన్ను వదిలేస్తుంది. పడవ మీద నదిని దాటిన తరువాత నువ్వు ఆ పడవను వదిలేస్తావు అలాగే మీకు ఆత్మజ్ఞానం కలుగచేసి ఈ సత్వగుణం మిమ్మల్ని వదిలేస్తుంది. అప్పుడు ఎటుచూసినా జ్ఞానమే, ఎటుచూసినా శాంతే. అప్పుడు మీరు గుణరహితస్థితిని పొందుతారు. ఇతరులకు సహాయం చేసాము అంటారు, సహాయం చేయటానికి అసలు నీకంటే వేరుగా ఒకడు ఉన్నాడా? ఈ దేహమే నేను అని నువ్వు అనుకోవటం వలన నాకంటే వేరుగా ఇంకొకడు ఉన్నాడు, నాకంటే వేరుగా ప్రపంచం ఉంది అని అనుకొంటున్నావు. నీ దేహానికి జబ్బు చేసింది అనుకో నువ్వు

వైద్యం చేయించుకొంటే ఎవరికైనా సహాయం చేసాను అని అనుకోవు. ఇంకో దేహానికి జబ్బు చేస్తే నువ్వు వైద్యం చేయిస్తే సహాయం చేసాను అనుకొంటున్నావు. అదే పాడుబుద్ధి, అదే వేరుబుద్ధి. నీ లోపల ఉన్న జ్ఞానాన్ని అందకుండా చేసేది ఆ బుద్ధే, అది తొలగించుకోవాలి.

అంత త్యాగం చేసాను, ఇంత త్యాగం చేసాను అంటారు, గొప్పలు చెప్పకొంటారు, అక్కడ నుండి రజోగుణం పెంచుకోవటం, పాడైపోవటం. సబ్జక్టు మీరు బాగా అర్థం చేసుకోవాలి. భగవంతుడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం ఉండాలి. మేము జపం చేస్తున్నాము, పూజలు చేస్తున్నాము, ధ్యానం చేస్తున్నాము, పుణ్యక్షేత్రాలకు వెళ్ళి వచ్చాము, నదులలో మునిగాము అంటే అవన్నీ మంచి పనులు కాదని అనటం లేదు. అవన్నీ చేయండి మంచిదే కాని అంతమాత్రంచేత మీకు మోక్షం వచ్చేస్తుంది అనుకోవద్దు. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, వాడికి ఒక సంకల్పం ఉంది, భగవంతుడి సంకల్పాన్ని నూటికి నూరుపాళ్ళు మన సంకల్పం చేసుకోవాలి. భగవంతుడి ఇష్టాన్ని మన ఇష్టం చేసుకోవాలి. భగవంతుడి సంకల్పాన్ని మన సంకల్పం చేసుకోకుండా, భగవంతుడి ఇష్టాన్ని మన ఇష్టంగా చేసుకోకుండా మీరు ప్రాణాయామం చేసిన, ఎన్ని సాధనలు చేసినా, పుణ్యక్షేత్రాలు దర్శించినా మీకు మోక్షం రాదు. ఎందుచేతనంటే మనకు మోక్షం ఇచ్చేవాడు భగవంతుడు. ఆయన సంకల్పానికి విరుద్ధంగా సంకల్పాలు పెంచుకొని, ఆయన ఇష్టానికి విరుద్ధంగా మీరు ఇష్టాలు పెంచుకొని ప్రవర్తిస్తూ మేమేదో ప్రాణాయామం చేసాము అంటే దానివలన మోక్షం రావటం మాట ఎలా ఉన్నా మీకు ఆయాసం మిగులుతుంది. ఇక్కడ కొండ చుట్టూ తిరుగుతున్నాము, మాకు వెంటనే మోక్షం వస్తుందా అని ఎవరో భగవాన్‌ను అడిగారు. మోక్షం మీకు వెంటనే వచ్చినా రాకపోయినా మీరు కొండ చుట్టూ తిరగటం వలన ఆకలి పెరుగుతుంది, పది ముద్దలు ఎక్కువ తినవచ్చు అని చెప్పారు. మీకు మోక్షం ఇచ్చేవాడు భగవంతుడు, ఆయన మీద మీకు నమ్మకం ఉండాలి. ఎవడైతే మనకు జ్ఞానదాతో, ఎవడైతే మనకు మోక్షదాతో వాడి మీద మనకు గౌరవం లేకుండా, వాడిమీద పూజ్యభావం లేకుండా ఏదో ప్రాణాయామం చేస్తున్నాము, మోక్షం వచ్చేస్తుంది అంటే అలా రాదు. అది మనకు అర్థమవ్వటం లేదు. అసలు మనకు సబ్జక్టు అర్థమవ్వటం లేదు, శరణాగతిభావనే మనకు రావటం లేదు. భక్తి అంటే జ్ఞానమాత అని భగవాన్ అనేవారు. భక్తి లేకుండా మనకు జ్ఞానం రాదు. మనకు భక్తి లేదు అనుకోండి, భగవంతుడి మీద మనకు విశ్వాసం లేదు అనుకోండి, ఏదో మన తెలివి తేటల వలన సాధన చేస్తున్నాము అనుకోండి, మన గుండెలో ఉన్న బరువైన రాళ్ళు

అంటే మనలోని బలహీనతలు బయటకు పోవు, ఇవి ఆపరేషన్ చేయించి తీసుకొనేవి కాదు.

రజోగుణం ఉన్నవారు, తమోగుణం ఉన్నవారు చేసే పని నీ కళ్ళకు కనిపిస్తుంది కాని, సహృదయం ఉన్నవారు సద్బుద్ధి ఉన్నవారు, సత్వగుణం ఉన్నవారు, మహాత్ములు చేసే పని నీ కళ్ళకు కనబడదు, అంటే వారు పని చేయటం లేదు అని కాదు, నీ కళ్ళకు అందనంత స్పీడుగా చేస్తారు, ఆ స్పీడును నీ కళ్ళు అందుకోలేవు. వారికి వేరుబుద్ధి లేదు. అహంభావరహిత స్థితిలో ఉన్నవారి ద్వారా పని ఎంత స్పీడుగా జరుగుతుంది అంటే దానిని మీ కళ్ళు పట్టుకోలేవు. బొంగరం చాలా వేగంగా తిరిగేటప్పుడు తిరగటం లేదేమో అని మనకు అనిపిస్తుంది. అలానే అహంభావరహితుడు చేసే పని నీ కళ్ళకు కనబడదు. మిమ్మల్ని ఉద్ధరిస్తాము అని వారు బయటకు వచ్చి ఉపన్యాసాలు చెప్పకపోవచ్చు, వారి సహృదయం, వారి మౌనం, వారి జ్ఞానం ద్వారా శక్తి తరంగాలు వచ్చి మీ మనస్సులో మార్పు తీసుకొని వస్తాయి, అయితే అది మన కళ్ళకు కనబడదు. ఎవడి మనస్సు అయితే ప్రశాంతంగా ఉంటుందో వాడికే లోతైన ఆలోచన ఉంటుంది. ఇప్పుడు మనకు లోతైన ఆలోచనరాదు. మీకు శాంతచిత్తం ఉంది అనుకోండి, అప్పుడు ఒక విషయాన్ని లోతుగా ఆలోచించగలరు. మీ మనస్సును విశ్లేషణ చేసుకోగలరు, మీ మనస్సును పరిశుద్ధం చేసుకోగలరు. ఆత్మను శోధించుకోగలరు. ఇలా ఎప్పుడైతే మన మనస్సు పవిత్రం అయ్యిందో, ఏకాగ్రం అయ్యిందో అప్పుడు ఈశ్వరుడు తనంతట తానే మీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. మీరు ఏదైనా కర్మ సాత్వికంగా చేస్తున్నారు అనుకోండి, వేరుభావన లేకుండా, కీర్తికాంక్ష కూడా లేకుండా మీరు క్వయిట్‌గా, కూల్‌గా చేసుకొంటూ వెళితే మీకు తెలియకుండానే కాలప్రవాహంలో ఈశ్వరుడు మీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు, అదే మీ కడసారి జన్మ. మీరు ప్రత్యేకంగా అడగనక్కరలేదు. మనకు అర్హత వచ్చేసింది అనుకోండి మనకు జ్ఞానం ఇవ్వటానికి ఒక్క నిమిషం కూడా ఆయన ఆలస్యం చేయడు. మనకు అర్హత లేదు అనుకోండి, యోగ్యత లేదు అనుకోండి మనం ఎంత అడిగినా ఇవ్వడు, చివరకు నోరు నొప్పి మిగులుతుంది.

అర్జునా! నేను కష్టపడి పనిచేస్తున్నాను కాని పని చేసి నెరవేర్చుకోవలసిన కోరిక అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు అయినా నేను పని చేస్తున్నాను అని పరమాత్మ చెప్పాడు. అలా మనం కూడా పని చెయ్యాలి. అలా పనిచేస్తే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. వ్యాసుడు గొప్ప పండితుడు, రచయిత అనుకొంటున్నాము. కృష్ణుడు భగవంతుడు అనుకొంటున్నాము కాని విష్ణుసహస్రనామాలను ధర్మరాజుకు భీష్ముడి చేత చెప్పించాడు.

భీష్ముడి చేత ఎందుకు చెప్పించాడు అంటే భీష్ముడు బాహ్యంగా గొప్ప వీరుడు కింద మనకు కనిపించినప్పటికీ భీష్ముడికి ధర్మశాస్త్రం అంతా బాగా తెలుసు, భగవంతుడి యొక్క వైభవం ఆయనకు తెలుసు. భగవంతుడి వైభవం భీష్ముడికి తెలుసునని, ధర్మశాస్త్రం ఆయనకు బాగా తెలుసు అని లోకానికి తెలియదు. అందుచేత కృష్ణుడు పన్నాగం ఏమిటి అంటే నేను చెపుతాను అని చెప్పలేదు, వ్యాసుడి దగ్గరకు వెళ్ళు అని చెప్పలేదు, మీ తాతగారి దగ్గరకు వెళ్ళు అని ధర్మరాజుకు చెప్పాడు. తాతగారి యొక్క ఔన్నత్యం మనకు చూపించటానికి చేసిన మాయ అది. తాతగారి మనస్సు పాండవుల దగ్గర ఉండేది, శరీరం కౌరవుల దగ్గర ఉండేది, ఇదంతా కర్మఫలితం, ఆ దేహ ప్రారబ్ధాన్ని బట్టి అలా జరిగింది. అది ఈశ్వరసంకల్పం. అది జ్ఞానం యొక్క అంతస్థుకు, జ్ఞానం యొక్క వైభవానికి భంగం కాదు చెప్పేవాడు ఆయనే, వినేవాడు ఆయనే, అసలు జ్ఞానికి వేరుభావన లేదు. నేనేదో చెపుతున్నాను, మీరేదో వింటున్నారు అని నేను అనుకొంటే అది నూటికి నూరుపాళ్ళు నా అజ్ఞానమే. నేను చెప్పటం వలన వీరు బాగుపడుతున్నారు అనుకొంటే అది నూటికి నూరుపాళ్ళు అజ్ఞానమే. మనం ఎవరినో ఉద్ధరిస్తున్నాము అనుకొంటే అక్కడ మన పతనానికి పునాది పడుతుంది. ఉద్ధరించటానికి నువ్వు ఎవడవు? ఒక మనిషి బాగుపడటానికి మనం అవకాశాలు ఇవ్వగలం కాని వాడిని మనం ఉద్ధరించలేము.

నీకు ఎప్పుడైతే అమృతానుభవం కలిగిందో ఇంక అప్పుడు వేరుభావన ఉండటానికి అవకాశం లేదు. ద్వైతంలో నుండే కోరిక వస్తుంది, ద్వైతంలో నుండే భయం వస్తుంది, ద్వైతంలో నుండి దుఃఖం వస్తుంది. సర్వ అరిష్టాలకు, సర్వ అనర్థాలకు ద్వైతబుద్ధే కారణం. ద్వైతబుద్ధి వేరుతో సహా నశించినప్పుడే ఆనందం, శాంతి నీకు అందుతాయి, జన్మరాహిత్యస్థితిని పొందుతావు. అక్కడ అది ఉద్ధరించాను, ఇక్కడ ఇది ఉద్ధరించాను అని ఎన్ని బుడబుక్కల మాటలు నువ్వు చెప్పినా, అహంకారంతో నీవు ఎన్ని పనులు చేసినా, ఎవడైతే అహంభావ రహితస్థితిలో ఉన్నాడో వాడి ద్వారానే లోకానికి ఎక్కువ మంచి జరుగుతుంది. నోటితో బుడబుక్కల మాటలు చెప్ప, అసలు నీవు చేసేటప్పుడు లోపల స్వార్థబుద్ధి పెట్టుకొని చేస్తున్నావా అనేది చూసుకో. నేను దేశాన్ని ఉద్ధరిస్తున్నాను అని చెప్పేటప్పుడు దేశం నీకు ముఖ్యమా, నీ స్వార్థం ముఖ్యమా అనేది చూసుకో. నీ స్వార్థమే ముఖ్యం అయినప్పుడు ఇంక నీవు దేశాన్ని ఉద్ధరించేది ఏమిటి? నిజంగా దేశాన్ని ఉద్ధరించేవాడు నేను దేశాన్ని ఉద్ధరిస్తున్నాను అని చెప్పడు, చెప్పవలసిన అవసరం వాడికి లేదు. మనం పని చెయ్యనప్పుడే బుడబుక్కల మాటలు

అన్నీ చెప్పాలి, నిజంగా చేసేటప్పుడు చెప్పవలసిన పనేమిటి?

ప్రపంచంలో దుఃఖం కనిపిస్తోంది, ఈ ప్రపంచానికి దుఃఖం లేకుండా ఎలా చెయ్యాలి అని అడుగుతున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే లోకంలో ఉన్న దుఃఖం గురించి నువ్వు ఆలోచిస్తున్నావు. ఇంతకీ నువ్వు దుఃఖం లేకుండా ఉన్నావా? అశాంతి లేకుండా ఉన్నావా? నువ్వు దుఃఖంతో, అశాంతితో బాధపడుతున్నావు. నీ దుఃఖాన్ని, అశాంతిని పోగొట్టుకోలేకపోతున్నావు, శవబుద్ధిలో నుండి బయటకు రాలేకపోతున్నావు, ఇంక నీవు ఎవరిని ఉద్ధరిస్తావు. నీకు తినటానికి తిండిలేదు, అన్నసత్రం కట్టిస్తాను అంటావు ఏమిటి? నీకు దుఃఖం లేదు అనుకో పోనీ అప్పుడు లోకంలో ఉన్న దుఃఖాన్ని నువ్వు తీసేయగలవు. నువ్వు అశాంతితో, దుఃఖంతో బాధపడుతున్నావు, ముందు నీ మాట ఏమిటి? నీ దుఃఖంలో నుండి, అశాంతిలో నుండి ముందు బయటకురా. నీవు దుఃఖంలో నుండి బయటకు వస్తే అసలు ప్రపంచం నాకంటే వేరుగా ఉంది అనే బుద్ధి కూడా పోతుంది, అంత దూరం వెళ్ళిపోతావు. నేను శరీరం లోపల ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, ఎక్కడో దేవుడు ఉన్నాడు, ఇదంతా నీవు కల్పించుకొన్నదే. నీకు ఎప్పుడైతే జ్ఞానం కలిగిందో అప్పుడు నీవు కల్పించుకొన్నది అంతా పోతుంది. ప్రపంచంలో దుఃఖం లేకపోయినా వీరి దుఃఖమే ప్రపంచం యొక్క దుఃఖంగా కనిపిస్తుంది. ముందు మనం దుఃఖం లేకుండా ఉంటే, అశాంతి లేకుండా ఉంటే మనకంటే వేరుగా ప్రపంచం అంటూ ఒకటి కనిపించదు. నీ లోపల ఉన్న దుఃఖమే, అశాంతే ప్రపంచంలో కనిపిస్తోంది. అందుకే మనవారు అంటారు ధర్మరాజుకు సృష్టిలో ఒక్కడూ చెడ్డవాడు కనబడలేదు, ధుర్యోధనుడికి ఒక్క మంచివాడూ కనబడలేదు అంటే మీ లోపల ఉన్నదే బయట కనిపిస్తోంది, మీలోపల లేనిది బయట ఏమీ కనబడదు. బాహ్యంగా ఎంత యుద్ధం చేసుకొన్నా కొంతమంది అసూయారహిత స్థితిలో ఉంటారు. కర్ణుడికీ, అర్జునుడికీ యుద్ధం జరిగినప్పుడు కర్ణుడు ఒక మాట చెపుతాడు. సవ్యసాచి చేతిలో మరణిస్తే అంతకంటే నాకు గౌరవం ఏముంది అంటాడు. ఈ ఒక్క వాక్యం చాలు వాళ్ళు ఎంత పెద్దవాళ్ళో చెప్పటానికి. కర్ణుడి యొక్క వైభవం తెలుసుకోవటానికి ఈ ఒక్క వాక్యం చాలు. బాహ్యంగా శత్రువుల కింద కనిపిస్తున్నారు, యుద్ధం చేస్తున్నారు. కాని ఎంత విశాల హృదయం ఉంటే ఇతరులలో ఉన్న ఔన్నత్యాన్ని అంగీకరించగలము. గంటల తరబడి, గంటల తరబడి పూజలు చేయటం కంటే కూడా ఒక వాక్యాన్ని బాగా అర్థం చేసుకొంటే ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి వస్తాము. ముందు నీవు లోపలకు చూడటం నేర్చుకో. నీకు దుఃఖం ఎందుకు

వస్తోంది, అశాంతి ఎందుకు వస్తోంది అని చూసుకొని, ఏ కారణాల వలన దుఃఖం వస్తోందో ఆ కారణాలను బయటకు లాగి కాల్చి బూడిద చెయ్యి. లోకం మంచిదీ కాదు, చెడ్డదీ కాదు. అది ఎక్స్‌రే లాంటిది. లోకం నీలో ఉన్న ప్లస్‌పాయింట్లను, మైనస్‌పాయింట్లను చూపిస్తుంది. నీలో ఏమైనా మైనస్‌పాయింట్లు కనబడితే ప్రయత్నం చేసి వాటిలో నుండి విడుదల పొందు. ఈ లోకంలోనికి వచ్చిన పని అదే. నీలో ఉన్న మైనస్‌పాయింట్లలో నుండి బయటకు రాకుండా ఎవడినో ఉద్ధరిస్తాను అంటావు ఏమిటి?

ఒకటి గుర్తుపెట్టుకోండి. ఈ ప్రపంచం ఒక ట్రైనింగ్ గ్రౌండ్. మనం ట్రైనింగ్ అవ్వటానికి ఈ లోకంలోనికి వచ్చాము. బాహ్యంగా మీరు ఏదైనా సబ్జక్టులో ఆల్ ఇండియా టాపర్ అయినా మీకు ఆత్మజ్ఞానం రాదు. మరి ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది? మనం రాగద్వేషాలు తగ్గించుకోవాలి. మీరు ఎంతటి వారైనా మీ మనస్సు కదులుతూ ఉంటుంది. మీరు ప్రశాంతంగా ఇంటి దగ్గర కూర్చుని మీ మనస్సు ఎందుకు కదులుతోంది అని మీరు లోపల ఆలోచించండి. మీ మనస్సు కొంచెం కదులుతోంది అనుకోండి, అవి లోకవిషయాలు అవ్వవచ్చు, కుటుంబవిషయాలు అవ్వవచ్చు, మరేదైనా విషయం అవ్వవచ్చు, మీ మనస్సు ఎందుకు కదులుతోంది అంటే అక్కడ ఇష్టం అయినా ఉండాలి, అయిష్టం అయినా ఉండాలి. రోగం అంతా ఇక్కడే ఉంది. యిష్టం ఉన్నచోట మనస్సు కదులుతుంది, అయిష్టం ఉన్న చోట మనస్సు కదులుతుంది. ఈ రెండు ఆపు చేయండి ఇంక మీ మనస్సుకు చాపల్యం లేదు. మీకు ఇష్టం లేదు అనుకోండి, అయిష్టం లేదు అనుకోండి, కోరిక లేదు అనుకోండి, కోపం లేదు అనుకోండి మీ మనస్సును మీరు కదలమని అడిగినా అది కదలదు. మన శరీరానికి బిపి ఉంది, షుగర్ ఉంది, పెరాలసిస్ వచ్చింది, కాళ్ళు నొప్పులు ఉన్నాయి, కళ్ళు మంటలు ఉన్నాయి, చెవులు వినబడవు ఇలా తొంబై రోగాలు ఉన్నాయి అనుకోండి, ఎన్ని రోగాలు ఉన్నా కంగారు పడవద్దు, ఈ శరీరం కాలిపోయినప్పడు ఆ రోగాలు అన్నీ కాలిపోతాయి. కాని రెండు రోగాలు వల్లకాటిలో కాలవు, అవి నేను అనే బుద్ధి, నాది అనే బుద్ధి, అవి రెండూ పెద్ద రోగాలు. అవి ఆపరేషన్ చేయించి తీయించేసుకొనేవి కాదు. ఈ రోగాల నుండి విడుదల పొందలేము అనుకోండి మనం ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే. నేను అనే తలంపు, నాది అనే తలంపు అనే ఈ పెద్ద రోగాల నుండి విడుదల పొందకుండా ఎవరికీ అమృతానుభవం కలుగదు. ఈశ్వరుని అనుగ్రహం లేకుండా ఈ పెద్ద రోగాల నుండి ఏ జీవుడు బయటకు రాలేడు. వాడికి ఎంత డబ్బున్నా, ఎంత అధికారం ఉన్నా, ఎంత చదువు ఉన్నా ఈ రోగాల నుండి బయటకు వస్తే గాని జీవుడు తరించలేడు.

మనం ఇక్కడ సుఖపడటం లేదు, చనిపోయాక ఎక్కడో సుఖపడదాం అనుకొంటాము. ఆ సుఖం ఇక్కడే ఉంది అని తెలియక అలా అనుకొంటాము. ఇప్పడు సుఖం లేనప్పడు చనిపోయాక ఎక్కడ సుఖం వస్తుంది. దీపం ఉండగానే నీకు వస్తువు కనబడటం లేదు, ఇంక దీపం ఆరిపోయాక వస్తువు ఎలా కనిపిస్తుంది. నరేన్ నాకు రెండు చేతులు ఉన్నాయి, ఒక చెయ్యి నిత్యం, ఒక చెయ్యి లీల అంటాడు రామకృష్ణుడు. లీల, నిత్యము ఒక్కటే. రెండు చేతులూ నావే. ఇది అర్థం చేసుకొంటే అవతారపురుషులయొక్క వైభవం మనకు తెలుస్తుంది. నీకు నిత్యం ఎంతో లీల కూడా అంతే, లీల అంటే అది నిత్యం యొక్క షాడో. నీకంటే భిన్నంగా నీడ ఉండదు అలాగే లీల కూడా అంతే. ఇది నిత్యం యొక్క షాడో అని మీకు తెలియక పోవటం వలన, ఆ లీలను నిజం అనుకోవటం వలన మీకు దుఃఖం వస్తోంది అని రామకృష్ణుడు చెప్పారు. ఈ లీల మనకు నిజం కింద కనిపిస్తోంది అందుకు మనం ఎంజాయ్ చేయలేక పోతున్నాము. ఇది నిత్యం యొక్క షాడో అని మనకు అర్థమైతే మనం ఎంజాయ్ చేయగలము. గొలుసులో బంగారం తీసివేస్తే గొలుసు లేదు అదేవిధంగా నిత్యం లేకపోతే లీలలేదు. ఒక చెయ్యి లీల, ఒక చెయ్యి నిత్యం అని అంటే దాని అర్థం ఏమిటి అంటే అక్కడ ఎలా ఉన్నానో, ఇక్కడా అలాగే ఉన్నాను, అక్కడ ఎలా పనిచేస్తున్నానో ఇక్కడా అలాగే పని చేస్తున్నాను అంటే పరమాత్మకు, లోకానికి మధ్యన బేధం లేదు ఎందుచేతనంటే లోకం రూపంలో ఉన్నవాడు కూడా పరమాత్మే. పరమాత్మను తీసేస్తే లోకం లేదు. దీని అర్థం ఏమిటి అంటే చనిపోయేవరకూ ఏడుస్తూ కూర్చోవద్దు, సబ్జక్టు అర్థం చేసుకోండి. ఈశ్వరుడికి భిన్నంగా సృష్టి లేదు. వ్యవహారంలో నీకు లాభం రావచ్చు, నష్టం రావచ్చు, ఇదంతా ఈశ్వరుడికి తెలియకుండా జరగటం లేదు. జీవితంలో హెచ్చుతగ్గులు వస్తూ ఉంటాయి, అవి నిజం కాదు, వాటిని ఈశ్వరుడే పంపిస్తాడు. వాటిని ఎందుకు పంపుతాడు అంటే నీ మీద కోపం కాదు, వాటి ద్వారా నీవు ట్రైనింగ్ పొందాలి. అది నీకు తెలియక దేవుడిని తిట్టిపోస్తావు. ఒకోసారి మీరు భరించలేనంత ధనం ఇస్తాడు, ఒకోసారి దారిద్ర్యం ఇస్తాడు. ఎందుచేతనంటే అందులోనుండి నేర్చుకోవలసిన పాఠాలు ఉంటాయి. ధనం వచ్చినప్పడు ఎలా ఉన్నారు, దారిద్ర్యం అనుభవించేటప్పడు ఎలా ఉన్నారు అని చూస్తాడు. ధనాన్ని మీరు ఇముడ్చుకో గలుగుతున్నారా, లేక అహంకారాన్ని పెంచుకొంటున్నారా అని చూస్తాడు. మీ బ్రెయిన్‌ను ఎలా బేలెన్స్ చేసుకొంటున్నారు అనేది భగవంతుడు చూస్తాడు.

భౌతిక ప్రేమలలో తల్లి ప్రేమ చాలా గొప్పది కాని నీ ప్రేమతో పోల్చినప్పడు తల్లి ప్రేమ కూడా ఎందుకు పనికిరాదు. సూర్యుడు ఉదయించాక చంద్రుడికి ఎంత విలువ ఉంటుందో ఈశ్వరుడి

ప్రేమ ముందు తల్లి ప్రేమ కూడా అంతే. మనకు జ్ఞానాన్ని ఇవ్వవలసింది ఈశ్వరుడే. మనలను అద్వైతానుభవంలోనికి తీసుకొని వెళ్ళేవాడు ఈశ్వరుడు ఒక్కడు మాత్రమే, అది ఆయనకే సాధ్యం. ఓ అరుణాచలేశ్వరుడా! నా యింటిలో నుండి నన్ను బయటకు తీసుకొని వచ్చావు. బయటకు తీసుకొని వచ్చి నన్ను వదిలెయ్యలేదు, నీ ఇంటిలో స్థానం ఇచ్చావు అంటే శవబుద్ధిని పోగొట్టి శివబుద్ధిని ప్రసాదించావు. నీ అనుగ్రహం ఇట్టిది అని ఎలా చెప్పగలను. అది ఈశ్వరుడి యొక్క వైభవం. మనకు భక్తి లేకపోతే ఏదీ రాదు. కృష్ణుడి యొక్క వైభవాన్ని భీష్ముడు గుర్తించాడు. ఆయనకు భక్తి లేకపోతే గుర్తించలేడు. భీష్ముడి భక్తి ఎంత గొప్పది అంటే కృష్ణుడు బండిచక్రం పట్టుకొని భీష్ముడి మీదకు వస్తూ ఉంటే ఆయన చేతిలో ఉన్న ఆయుధాలను పడేసాడు, నన్ను చంపటానికి నీకు బండిచక్రం కావాలా అంటాడు. అక్కడ ఉన్నవాడు నారాయణుడు అని గ్రహించాడు. నారాయణుడే ఆరూపంలో వచ్చాడు అని భక్తి లేకపోతే గ్రహించటం సాధ్యం కాదు. మీకు లక్ష వేల కోట్ల డబ్బు ఉన్నా భక్తి లేకపోతే అది గ్రహించలేరు.

ఈ మధ్య మేము మద్రాసులో పార్థసారథి కోవెలకు వెళ్ళాము. వివేకానందుడు ఒకసారి మద్రాసులో ఉన్న ఆయన ఫ్రెండ్‌కు ఒక లెటరు వ్రాసాడు. నువ్వు ఎప్పుడైనా పార్థసారథి కోవెలకు వెళుతూ ఉండు. వాడు అర్జునుడికే రథం తోలాడు అనుకోవద్దు. నువ్వు కృష్ణుడిని నమ్మితే నీకు కూడా సారధ్యం వహిస్తాడు. ఆయన ఆవులను కాసేవాడు. ఎప్పుడూ ఆయన కామన్ మేన్‌కు దూరం అవ్వలేదు. అది మనం మర్చిపోకూడదు అని వ్రాసాడు. ఇంకో మాట కూడా వ్రాసాడు. నువ్వు ఆత్మజ్ఞానసముపార్జనకు ఏ రోజున సాధన మొదలుపెట్టావో ఆ రోజునే జ్ఞానం వచ్చేస్తుంది అనుకోకు. నువ్వు చేసే ప్రయత్నం విడిచిపెట్టవద్దు. అది ఎప్పుడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి అనేది ఈశ్వరుడు నిర్ణయించుకొంటాడు. నీ చేతిలో ఉన్న పని హృదయపూర్వకంగా చెయ్యి. ఆయన చేతిలో ఉన్న పనిని జ్ఞాపకం చేయనక్కరలేదు. నీకు ఎప్పుడు, ఎలా సహకరించాలో ఆయన సహకరిస్తాడు. నీ జీవిత రథానికి కృష్ణుడిని సారథిగా చేసుకో. కృష్ణుడు చెయ్యమని చెప్పిన పనులు చెయ్యి, ఆయన వద్దని చెప్పినవి మానివెయ్యి. చెయ్యవలసిన పనులు గుర్తుంచుకో అవి చేయటానికి, చెయ్యకూడని పనులు కూడా గుర్తుంచుకో అవి చెయ్యకుండా ఉండటానికి. అది అమృత బోధ, ఆకాశ గంగ, అది వాడికి మానవజాతి మీద ఉన్న ప్రేమ. ప్రపంచాన్ని జ్ఞాని ప్రేమిస్తాడు. అది వాడి నేచర్. జ్ఞానికి ప్రేమించటం సహజం. నీ మనస్సులో ఎన్ని బలహీనతలు ఉన్నా, ఎంత పెంట ఉన్నా నారాయణ స్మరణ చాలు దాన్నంతా కాల్చి బూడిద చేయటానికి అని వ్యాసుడు భారతంలో చెప్పాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 19-01-07 శుక్ర | పెదకాపవరం, వేణుగోపాలస్వామి గుడి వద్ద (ఆకివీడుకు 8 కి.మీ.) |
| 21-01-07 ఆది | మల్కిపురం, సాయిబాబాగుడి ప్రాంగణం |
| 02-02-07 శుక్ర | తాడినాడ |
| 04-02-07 ఆది | పాలమూరు |
| 07-02-07 బుధ | సఖినేటిపల్లి, గీతామందిరం |
| 11-02-07 ఆది | కాపవరం, గీతాభవనం |
| 16-02-07 శుక్ర | (శివరాత్రి) చించినాడ |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**




**కాకినాడ దుర్గాసోము చారిటబుల్ ట్రస్ట్‌లో సద్గురు శ్రీ నాన్నగారు**

# ఆనందమే గురువుగా కనబడతాడు

మనం ఎప్పడూ పరమాత్మణ్ణి చూడలేదు. మనం చూడని దానిని ప్రేమించలేము. గురువు మీద ప్రేమ పరమాత్ముని మీద ప్రేమ ఒక్కటే. మనం మానవులము కాబట్టి మన ప్రేమకు ఆధారం ఒక మానవుడే ఉండాలి. అదే గురు రూపం. సద్గురువు మీద ప్రేమ అతి ఆనందదాయకంగాను, ఆకర్షణీయంగాను, మైమరపించేదిగాను ఉంటుంది. ఆత్మ ప్రకాశంలో వెలిగే వారి చక్కని సౌందర్యం, మనలను భవసాగరాన్ని దాటించటానికి వారి వైపు ఆకర్షిస్తూ ఉంటుంది. గురువును అర్థం చేసుకోవటం ఎవరి తరం కాదు. వారు అనుగ్రహించిన వారు మాత్రమే వారిని అర్థం చేసుకోగలరు. కన్నులున్నవారు గుడ్డివానికి తన చేతిని అందిస్తే గుడ్డివాడు పట్టుకోగలడు. మనమంతా గుడ్డివాళ్లమే. గురువు కళ్ళున్న జ్ఞాని. వారు మన అంతరంగంలో అంతా చూస్తూనే ఉన్నారు. మనం మనో వికారాలలో ఉంటాము. అందుకే మనకు పూర్తి విశ్వాసం కుదరటం లేదు. సద్గురువును దర్శనం చేసుకొన్నవారు ధన్యులు. మనస్ఫూర్తిగా గురువు ఎడల నిజమైన ప్రేమ, వారి దర్శనం కోసం నిజమైన తపన ఉన్నట్లైతే ఎన్నో వందల సంవత్సరాలు జపధ్యానాదుల వల్ల కూడా కలుగనంత గొప్ప ప్రశాంతతగా మనస్సు మారిపోతుంది. మనస్సు నిర్మలత్వం చెంది ముక్తి పొందటానికి తరుణోపాయం, సద్గురువునందు నిజమైన ప్రేమ, ఆయన యందు మొక్కవోని నమ్మకం కలగటమే. ఆయనను మానవునిగా తలచకపోవటమే. వేమన అన్నారు “లీవి లేదు టంచు డెందబులో నెంచడు, జ్ఞాని నెరుగలేడు మానవుండు, ఢాంభికునకు లొంగడు” అన్నారు. సద్గురువు ప్రేమ లభించినవాడు నోరుమూత పడుతుంది. బాహ్య నేత్రాలు మూసుకొనిపోతాయి. మనస్సు శాంతితో నిశ్చలమౌతుంది అంతేకాక మనస్సు గురు పాదాలలో లీనమౌతుంది. కాని ఆ ప్రేమ రంగు అద్దటానికి హృదయమనే వస్త్రం పరిశుద్ధంగా ఉండాలి. రోజరు అనే ఆంగ్లేయుడు ఇలా అన్నాడు “మీరు గురువును అంత ప్రేమగా, ఆనందంగా ఎందుకు చూచుకొంటున్నారు. అంటే మిమ్ములను మీరు చూచుకోవటం వల్ల” అని. గురువు బాహ్యంగా మానవాకారం, అంతరంగంలో పరమాత్మ రూపం ఈ నిజాన్ని గుర్తించినవాడు ధన్యుడు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం